సాక్షి
చిత్తూరు
బుధవారం ၊ 23 ၊ అక్టోబర్ ၊ 2024



బహుదా ఉగ్రరూపం

బహుదానది ఉగ్రరూపం దాల్చడంతో కల్వర్టులు కొట్టుకుపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. - 8లో



హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక

పూతలపట్టు హైస్కూల్‌లో జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ జట్లను ఎంపిక చేసినట్లు స్కూల్ గేమ్స్ కార్యదర్శి తెలిపారు. - 8లో



రోగాలు ప్రబలకుండా చర్యలు

వర్షాలకు గ్రామీణ ప్రాంతాల్లో రోగాలు ప్రబలకుండా వైద్యసిబ్బంది చర్యలు చేపట్టాలని డీహెచ్‌ఎంఓ ఆదేశించారు. - 8లో

న్యూస్‌రీల్

అభ్యసనా సామర్థ్యాలను పెంచండి

– జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

కల్లూరు(రొంపిచెర్ల): విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ అన్నారు. మంగళవారం ఆయన పులిచెర్ల మండలంలో పర్యటించి కల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చూడాలని టీచర్లకు సూచించారు. విద్యార్థులకు డొక్కాసీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం ద్వారా రుచికరమైన భోజనం అందించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన నిర్వాహకులు మాట్లాడుతూ రెండు నెలల జీతాలు ఇవ్వాలని, అలాగే పారిశుద్ధ్య కార్మికులు మాట్లాడుతూ తమకు మూడు నెలల జీతాలు ఇవ్వాలని ఈ సందర్భంగా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ పెండింగ్ జీతాలను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే ఇంటర్ తరగతులను పరిశీలించారు. అనంతరం మతుకువారిపల్లె సమీపంలో నిర్మిస్తున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం, మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలికల గురుకుల పాఠశాలలో భవన నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజశేఖర్‌బాబు, ఎంఈఓలు సిద్ధరామయ్య, తాతయ్య, హెచ్‌ఎం శ్రీవాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లాకు 300 టన్నుల జొన్నలు

చిత్తూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు 300 టన్నుల జొన్నలను కేటాయించినట్లు జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ బాలకృష్ణ తెలిపారు. ఈ జొన్నలను నంద్యాల జిల్లా నుంచి తెప్పిస్తున్నామని, రెండు రోజుల్లో జిల్లాకు పూర్తి స్థాయిలో చేరతాయని చెప్పారు. వచ్చే నెల నుంచి రేషన్‌కార్డుదారులకు ఉచితంగా మూడు కేజీల వరకు అందిస్తామని ఆయన పేర్కొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై సమీక్ష



సమావేశంలో పాల్గొన్న ఈఈ మునిచంద్ర, డీఈలు

చిత్తూరు కార్పొరేషన్: స్మార్ట్‌మీటర్ల ఏర్పాటుపై ట్రాన్స్‌కో తిరుపతి, చిత్తూరు జిల్లాల ఎస్‌ఈలు సురేంద్రనాయుడు, ఇస్మాయిల్ అహ్మద్ మంగళవారం ఈఈ, డీఈ, ఏఈలతో సమీక్షించారు. డివిజన్ల వారీగా జరుగుతున్న మీటర్ల ఏర్పాటుపై వివరాలు తెలుసుకున్నారు. తొలుత ప్రభుత్వ కార్యాలయాలకు వీటిని ఏర్పాటు చేయాలని, తర్వాత దశల వారీగా పరిశ్రమలు, వాణిజ్య సర్వీసులకు ఏర్పాటు చేయాలనుకున్నట్లు చెప్పారు. తద్వారా ఆటోమేటిక్‌గా వాడిన విద్యుత్ రీడింగ్ తెలుస్తుందన్నారు. మీటర్‌లో సమస్య ఉంటే అప్పటికప్పుడు తెలుసుకోవచ్చన్నారు. బిల్లులు చెల్లించని పక్షంలో ఆన్‌లైన్‌లో డిస్‌కనెక్ట్ చేసే సౌకర్యం ఉందన్నారు. వేగంగా వీటిని ఏర్పాటు చేయాలని, విద్యుత్ అంతరాయం ఏర్పడితే సకాలంలో స్పందించి పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఈఈలు మునిచంద్ర, సురేష్, డీఈలు ప్రసాద్, ఆనంద్, శేషాద్రి, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ గ్రీవెన్స్

జిల్లాలోని అన్ని డివిజన్ కార్యాలయాల్లో బుధవారం విద్యుత్ గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో ఎస్‌ఈ ఇస్మాయిల్‌అహ్మద్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా డివిజన్ల వినియోగదారులు సమస్యలను తెలపాలన్నారు. వాటిని నమోదు చేసుకుని పరిష్కారం కోసం అధికారులు కృషి చేయనున్నట్లు చెప్పారు. ఉదయం 11 గంటల నుంచి ఫిర్యాదులు తీసుకుంటారని తెలిపారు.

నిధుల మంజూరు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులకు ఎస్కార్ట్ అలవెన్స్‌లను మంజూరు చేస్తూ రాష్ట్ర సమగ్రశిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీచేశారు. ఆ మేరకు మంగళవారం జిల్లా సమగ్రశిక్ష శాఖకు ఉత్తర్వులు అందాయి. జిల్లాలో 1 నుంచి 8వ తరగతి వరకు చదువుతున్న విభిన్న ప్రతిభావంతులకు 380 మందికి గాను ఒక్కొక్కరికి రూ.3 వేల చొప్పున రూ.11,40,000, 9వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు చదువుతున్న 119 మందికి రూ.3 వేల చొప్పున రూ.3,57,000 బడ్జెట్‌ను మంజూరు చేశారు. ఈ బడ్జెట్‌ను ఏవిధంగా ఉపయోగించాలన్న విషయంపై ఉత్తర్వుల్లో సమగ్రంగా పేర్కొన్నారు.

చిరుద్యోగులపై సర్కారు కక్ష



రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాలతో చిరుద్యోగుల జీవితాలు ప్రశ్నార్థకమవుతున్నాయి. అధికారంలోకి వచ్చిన రోజు నుంచి ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగించే పనిలో పడింది. తాజాగా ఆరోగ్యమిత్రలను సైతం తొలగించి, ఆ సేవలను ప్రైవేటుపరం చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో ఆరోగ్యమిత్రలు తమకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు పలు డిమాండ్లను పరిష్కరించాలని ఏపీ వైద్య మిత్ర కాంట్రాక్ట్ అండ్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ తరపున ఉద్యోగులు జిల్లా అధికారులకు విన్నవించారు. లేని పక్షంలో ఈ నెల 29 నుంచి సమ్మెకు దిగేందుకు సిద్ధమయ్యారు.

- ఇప్పటికే పొరుగు సేవల ఉద్యోగులను తొలగించేందుకు కుట్ర
- తాజాగా ఆరోగ్యశ్రీ వైద్యమిత్రల మెడపై కత్తి పెట్టిన సర్కారు
- ప్రశ్నార్థకంగా 52 మంది చిరుద్యోగుల జీవితాలు
- డిమాండ్లు పరిష్కరించని పక్షంలో ఈ నెల 29న సమ్మెకు దిగేందుకు సిద్ధం
- వైద్యమిత్రల సమ్మెతో ఆరోగ్యశ్రీ సేవలకు ఇబ్బందులు



అధికారులకు సమస్యలను విన్నవిస్తున్న ఆరోగ్యమిత్రలు

కాణిపాకం: కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచే చిరుద్యోగులపై కక్షకట్టింది. కొత్త కొలువుల భర్తీని అటు ఉంచితే ఉన్న ఉద్యోగాల్లో కోతలు పెట్టేందుకు సిద్ధమైంది. విభాగాల వారీగా చిరుద్యోగుల మెడపై కత్తి పెట్టి నిర్దాక్షిణ్యంగా సాగనంపే చర్యలు చేపట్టింది. ఇటీవలి వరకు వివిధ విభాగాల్లో ఔట్‌సోర్సింగ్ విభాగంలో పని చేసే వారిని తొలగించిన ప్రభుత్వం తాజాగా ఆరోగ్యమిత్రలపై కత్తి పెడుతోంది. జిల్లావ్యాప్తంగా 74 ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులు ఉన్నాయి. వీటి పరిధిలో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో 52 మంది సిబ్బంది పని చేస్తున్నారు. అయితే వీరికి ఉద్యోగ భద్రత కొరవడుతోంది. చాలీచాలని వేతనాలతో తీవ్ర ఇక్కట్లు పడుతున్నామని వైద్యమిత్రలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే వారు అధికారులకు తమ గోడు విన్నవించుకున్నారు.

జిల్లాలోని ఆరోగ్యశ్రీ ఆస్పత్రి వివరాలు

ప్రభుత్వ నెట్‌వర్క్ ఆస్పత్రులు	4	ప్రైవేటు ఆస్పత్రులు	9
సీహెచ్‌సీ నెట్‌వర్క్ ఆస్పత్రులు	7		
పీహెచ్‌సీ నెట్‌వర్క్ ఆస్పత్రులు	47	డెంటల్ క్లినిక్‌లు	7
మొత్తం	74		

ఆరోగ్యశ్రీ సేవలు ఇలా..

ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పేదవారికి ప్రైవేటు ఆస్పత్రుల్లో సైతం అత్యాధునిక వైద్యసేవలు అందిస్తున్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ కింద చికిత్స చేయించుకునే వారి వివరాలు అప్‌లోడ్ చేసేందుకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించారు. వీరు ఆస్పత్రుల్లో రోగులకు ఆరోగ్యశ్రీ కింద చికిత్స చేయించి ప్రభుత్వం మంజూరు చేసిన నగదును అందిస్తారు. ఇలా 17 ఏళ్లుగా ప్రజలకు సేవలు అందిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఆరోగ్యశ్రీ పథకం పేరును ఎన్టీఆర్ వైద్యసేవగా మార్చింది. ఈ క్రమంలో తమ న్యాయమైన డిమాండ్లపై కూటమి ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో ఆరోగ్యమిత్రలు ఈ నెల 29 నుంచి సమ్మెకు పిలుపునిచ్చారు. దీంతో పథకం అమలు ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఏర్పడింది. ఇదిలా ఉంటే కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి చిరుద్యోగులపై కక్షగట్టింది. ఒక్కో రంగంలో పని చేసే కార్మికులపై కత్తి పెట్టి రోడ్డున పడేస్తూ వస్తోంది. ప్రస్తుతం వైద్యమిత్రలను తొలగించి ప్రైవేటుకు అప్పగించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ పరిస్థితుల్లో ఎన్టీఆర్ వైద్యసేవ సిబ్బంది సమ్మెకు సిద్ధమవుతున్నారు.

ఆరోగ్యశ్రీ విభాగంలో పని చేసే వారు..

జిల్లా కోఆర్డినేటర్ 1	డీఈఓ 1
టీమ్ లీడర్లు 2	ఆరోగ్యమిత్రలు 48

మహానేత పుణ్యమే ఆరోగ్యశ్రీ

ప్రతి పేదవాడికి కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించాలనే ఉద్దేశంతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి పూనుకున్నారు. డబ్బు లేని కారణంగా పేదలు వైద్యసేవలకు దూరమై ప్రాణాలు కోల్పోయే పరిస్థితి రాకూడదని, ఒక్కరూపాయి లేకపోయినా కార్పొరేట్ ఆస్పత్రుల్లో సైతం నాణ్యమైన చికిత్స పొందేలా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి 2008 జులై 17న ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ పథకంలో పని చేసే వైద్యమిత్రలకు అప్పట్లో రూ.3500 వేతనం నిర్ణయించి జీతభత్యాలను ప్రారంభించారు. అలా 17 ఏళ్లపాటు ప్రజలకు సేవలందించిన సిబ్బంది ప్రస్తుతం తమ డిమాండ్ల సాధన కోసం సమ్మెకు సిద్ధమవుతున్నారు. కూటమి ప్రభుత్వం పేదల ఆరోగ్యం విషయంలో ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందో అందరికీ తెలిసిందే. అయితే అందులో పని చేసే వైద్యమిత్రలను తొలగించి ప్రైవేటు అప్పజెప్పేందుకు పావులు కదుపుతున్నట్లు సమాచారం.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆయుష్..

మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి మరణానంతరం వచ్చిన ముఖ్యమంత్రులు ఈ పథకాన్ని తుంగలో తొక్కారు. 2014–19 మధ్యకాలంలో చంద్రబాబు ప్రభుత్వం పథకం పేరు అయితే మార్చింది గానీ తగినన్ని నిధులు విడుదల చేయకుండా నిర్వీర్యం చేసింది. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకం సేవలను విస్తరించారు. ఆరోగ్యశ్రీలో 3,254 జబ్బులకు చికిత్సలు చేసేలా రూపకల్పన చేశారు. అలాగే ఆరోగ్యశ్రీ వైద్యచికిత్స పరిమితిని రూ.25 లక్షలకు పెంచారు. ఆరోగ్యశ్రీలో పని చేసే సిబ్బంది వేతనం రూ.15000 పెంచారు. 2024 ఎన్నికల ఫలితాల అనంతరం ప్రభుత్వం మారడంతో వైద్యమిత్రలు తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ సమ్మెకు పిలుపునిచ్చారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఆరోగ్యశ్రీ అధికారులకు సమ్మె నోటీసు అందించారు.

ఇవీ డిమాండ్లు..

- జిల్లావ్యాప్తంగా పనిచేస్తున్న 52 మంది తమ డిమాండ్లను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు..
- ఆరోగ్యశ్రీ పథకంలో పనిచేస్తున్న క్షేత్రస్థాయి సిబ్బందిని 17 ఏళ్ల సర్వీసును పరిగణనలోకి తీసుకుని కేడర్ కల్పించి సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలి. ప్రభుత్వ కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించాలి.
- ట్రస్ట్ ఫీల్డ్ సిబ్బందికి నిర్వహించిన వన్‌టైం ఎగ్జామ్‌ని ఉపసంహరించుకోవాలి.
- క్షేత్రస్థాయి సిబ్బందికి అంతర్గత పదోన్నతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలి.
- చనిపోయిన సిబ్బందికి రూ.15 లక్షలు ఎక్స్‌గ్రేషియా కల్పించాలి. అలాగే రిటైర్డు అయినా, రిటైర్డు కాబోతున్న వారికి రూ.10 లక్షలు గ్రాట్యుటీ ఇవ్వాలి.

ఎన్టీఆర్ జలాశయం గేట్లు ఎత్తివేత

కార్వేటినగరం : మండలంలోని ఎన్టీఆర్ జలాశయం పూర్తిగా నిండిపోవడంతో మంగళవారం సాయంత్రం అధికారులు రెండు గేట్లు ఎత్తి 300 క్యూసెక్కుల నీరు జలాశయం దిగువకు వదిలారు. జలాశయం పూర్తి నీటి మట్టం 108,9 ఎంసీఎఫ్‌టీల సామర్థ్యం. కాగా మంగళవారం మధ్యాహ్నం నుంచి ఇరిగేషన్ డీఈ జయచంద్రబాబు జలాశయం వద్ద అధికారులతో పర్యవేక్షించారు. నీవానది పరివాహక ప్రాంతాలైన గంగాధరనెల్లూరు, పెనుమూరు మండలాల్లో గేట్లు ఎత్తుతున్నట్లు దండోరా వేయించారు. జలాశయానికి ఇన్‌ఫ్లో ఎక్కువగా ఉండడంతో రెండు గేట్ల ద్వారా నీటిని విడుదల చేశారు.



రెండు గేట్లు ఎత్తడంతో జలాశయం నుంచి దిగువకు వెళ్తున్న వరద నీరు

పోలీసు గ్రీవెన్స్‌కు 27 ఫిర్యాదులు

చిత్తూరు అర్బన్: పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) కార్యక్రమానికి 27 ఫిర్యాదులు అందాయి. మంగళవారం చిత్తూరులోని పోలీసు ఆర్ముడు రిజర్వు కార్యాలయంలో ఎస్పీ మణికంఠ ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలను పరిష్కరించడంలో అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలన్నారు. ఇందులో కుటుంబ తగాదాలు, వేధింపులు, డబ్బు తగాదాలు, భూ తగాదాలు, ఆస్తి తగాదాలకు సంబంధించిన ఫిర్యాదులు ఉన్నాయి. వచ్చిన ప్రతి ఫిర్యాదుపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వీటిని ఆన్‌లైన్‌లో సైతం నమోదు చేయాలన్నారు.




ప్రజల సమస్యలు వింటున్న ఎస్పీ మణికంఠ

ఐటీఐలో ఐదో విడత ప్రవేశాలకు దరఖాస్తు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో ఐదో విడత అడ్మిషన్లకు అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా కన్వీనర్ రవీంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని 7 ప్రభుత్వ, 10 ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో ఐదో విడత అడ్మిషన్లు పొందవచ్చన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు www.iti.ap.gov.i n వెబ్‌సైట్‌లో ఈ నెల 26వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తుల ప్రక్రియ ముగిసిన అనంతరం ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్లు పొందే విద్యార్థులకు ఈ నెల 28న, ప్రైవేట్ కళాశాలల్లో అడ్మిషన్లు పొందే వారికి ఈ నెల 30వ తేదీన కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. వివరాలకు 7799933370, 7799201479 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఇసుకాసురులపై చర్యలేవి సార్..!



చౌడేపల్లె: లద్దిగం చెరువులో హిటాచీలతో గుంతలు పూడ్చుతున్న దృశ్యం

- పట్టుబడిన హిటాచీలకు జరిమానాలతో సరి పెట్టినట్లేనా ?
- రూ.కోట్లు వెనుకేసుకున్న వారిపై కేసులు శూన్యం
- కంటి తుడుపుగా చెరువులో గోతులు పూడ్చివేత
- అధికారుల తీరుపై మండిపడుతున్న జనం

పుంగనూరు: అక్రమంగా ఇసుకను తరలించి రూ.కోట్లు వెనుకేసుకున్న అక్రమార్కులను పోలీసులు, అధికారులు వదిలేశారు. చెరువులో ఇసుకను తోడుతుండగా పట్టుబడిన హిటాచీలకు తూతూమంత్రంగా జరిమానా విధించి, ఆపై రైతుల ఆగ్రహాన్ని చల్లార్చేందుకు కంటి తుడుపు చర్యలు చేపట్టి నిజాయితీ అనే ముసుగు తొడుక్కుంటున్నారు. మంగళవారం లద్దిగం పెద్ద చెరువులో ఇసుకాసురులైన తెలుగు తమ్ముళ్లు హిటాచీలతో తోడేసి ఇసుకను తరలించిన గుంతలను పూడ్చే కార్యక్రమం చేపట్టారు. ఇష్టారీతిన ఇసుక కోసం గోతులు తవ్వడంతో చెరువు రూపురేఖలే కోల్పోయింది. చెరువులో ఆరు రీచ్‌లు ఏర్పాటు చేయడంతో వేలాది లోడ్ల ఇసుకను తరలించడం దీన్ని, రైతులు అడ్డుకోవడం పాఠకులకు విదితమే. జిల్లాలోనే అధికస్థాయిలో లద్దిగం చెరువులో ఇసుక దోపిడీ బహిరంగంగా జరిగినా ఇందుకు కారణమైన నెల్లూరు వ్యాపారి, సహకరించిన తెలుగుదేశం నాయకులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం, మైన్స్ అధికారులు ఎలాంటి రాయల్టీ రుసుం విధించకపోవడం సర్వత్రా విమర్శలకు దారితీస్తోంది. అధికారుల పక్షపాత చర్యలపై జనం మండిపడుతున్నారు.

సంపూర్ణ అక్షరాస్యతకే ఉల్లాస్

– కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : సంపూర్ణ అక్షరాస్యత జిల్లాగా చిత్తూరును మారుద్దామని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చిత్తూరు జిల్లాను ఉల్లాస్ (అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్‌లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. జిల్లాలో రానున్న మూడేళ్లలో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ఉల్లాస్ కార్యక్రమం అమలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు ప్రభుత్వ స్కూళ్లలోని మధ్యాహ్న భోజన కార్మికులు, ఆయాలు, హెల్పర్లు, వాచ్‌మెన్‌లు (15–50 సంవత్సరాలలోపు), తదితర విభాగాల్లో ఉన్న నిరక్షరాస్యులను గుర్తించి, వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ప్రాథమిక అక్షరాస్యత, ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత, ఆరోగ్య సంరక్షణ అవగాహన, కుటుంబ సంక్షేమంతో పాటు తదితర జీవన నైపుణ్యాలతో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. వృత్తి నైపుణ్య అభివృద్ధి, ప్రాథమిక విద్య, సమానత్వాన్ని అందించడంతో పాటు సంపూర్ణ వయోజన విద్యా కోర్సులతో నిరంతర విద్య ఉల్లాస్ పథకంలో అందజేయాలన్నారు.

30లోపు వివరాలు సేకరించండి

మండలాల వారీగా ఈ నెల 30వ తేదీలోపు నిరక్షరాస్యుల వివరాల సేకరణ, మాస్టర్ ట్రైనర్ ఎంపిక, సంబంధిత సర్వేను పకడ్బందీగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో 2024–25 సంవత్సరానికి 9,078 మందిని అక్షరాస్యులుగా మార్చడమే లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు తెలిపారు. ఎంపీడీఓల అధ్యక్షతన సంబంధిత మండలాల్లో మండల స్థాయి కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాల్లో నిరక్షరాస్యులను గుర్తించి ఉల్లాస్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. నిరక్షరాస్యులకు బోధించేందుకు ఆసక్తి ఉన్న స్వచ్ఛంద టీచర్లను గుర్తించాలని తెలిపారు. తరగతుల నిర్వహణకు స్కూళ్లలో, ప్రభుత్వ కమ్యూనిటీ కార్యాలయాల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో అనుకూలమైన ప్రాంతాలను గుర్తించాలన్నారు. డిజిటల్ కంటెంట్‌తో బోధించేందుకు కంప్యూటర్ టీవీలు ఉన్న గదులను గుర్తించాలన్నారు. మూడేళ్ల పాటు జరిగే ఈ కార్యక్రమంలో ఉద్యోగులు, స్వచ్ఛంద సేవాసంస్థలు, సామాజిక కార్యకర్తలు భాగస్వామ్యం కావాలన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం డీఆర్‌డీఏ, విద్యాశాఖ, ఐసీడీఎస్, పంచాయతీరాజ్ శాఖలు ఉల్లాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు, వయోజన విద్యాశాఖ ఏడీ నాగేశ్వరరెడ్డి, డీఎల్‌డీఓ రవికుమార్, డీపీఓ పార్వతి, ఐసీడీఎస్ పీడీ హైమావతి, డీఆర్‌డీఏ ఏపీఓ రవి పాల్గొన్నారు.

ఎమ్మార్సీ, స్కూళ్లకు గ్రాంట్ విడుదల



మాట్లాడుతున్న ఏపీసీ వెంకటరమణారెడ్డి

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు, ఎమ్మార్సీ (ఎంఈఓ) కార్యాలయాలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులను విడుదల చేసిందని జిల్లా సమగ్రశిక్షా శాఖ అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని ఒక్కో ఎమ్మార్సీ కార్యాలయానికి రూ.1,30,000 చొప్పున నిధులు మంజూరు చేశారన్నారు. ఈ నిధుల్లో మెయింటెనెన్స్‌కు రూ.30 వేలు, కాంటింజెన్సీకి రూ.40 వేలు, టీఎల్‌ఎంకు రూ.30 వేలు, మీటింగ్స్ టీఏకు రూ.30 వేలు ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. జిల్లాలోని 31 ఎమ్మార్సీ కార్యాలయాలకు రూ.40.3 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఎంఈఓలు నిబంధనల మేరకు నిధులను ఖర్చు చేసి బిల్లులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. అలాగే జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, కేజీబీవీ, మోడల్ తదితర పాఠశాలల నిర్వహణకు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. జిల్లాలోని 2396 స్కూళ్లకు రూ.532.5 లక్షలకు గాను ప్రస్తుతం 50 శాతం రూ.266.25 లక్షలను మంజూరు చేశారని ఏపీసీ వెల్లడించారు.

7న స్కౌట్స్, గైడ్స్ వ్యవస్థాపక దినోత్సవం

చిత్తూరు కలెక్టరేట్ : భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ 75వ ఫౌండేషన్ డేని పురస్కరించుకుని జిల్లాలో నవంబర్ 7వ తేదీ నుంచి 14 వరకు షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు నిర్వహించాలని డీవైఈఓ చంద్రశేఖర్ ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాలకు సంబంధించిన షెడ్యూల్‌ను రాష్ట్ర విద్యాశాఖ అధికారులు జారీచేశారు. సంబంధింత షెడ్యూల్ ప్రకారం స్కూళ్లలో కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. విద్యార్థులకు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ చరిత్రపై పోటీలు నిర్వహించాలని డీవైఈఓ ఆదేశించారు.

క్లుప్తంగా

పిడుగు పడి ఆవులు మృతి



రొంపిచెర్ల: పిడుగులు పడడంతో జిల్లాలోని పలుచోట్ల పాడి ఆవులు మృతి చెందాయి. వివరాలు.. రొంపిచెర్ల గ్రామ పంచాయతీ శ్రీరాములు గుడి వీధికి చెందిన కృష్ణయ్య 10 పాడి ఆవులను కొనుగోలు చేసి వాటితోనే జీవనం సాగిస్తున్నాడు. గ్రామానికి దగ్గరలోని కృష్ణమూర్తి కాలనీ సమీపంలో కొంత భూమిని లీజుకు తీసుకుని గడ్డి పెంచుకుంటూ అక్కడే ఆవులకు వేసి పోషిస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం రెండు గంటలకు పడిన పిడుగుల వర్షానికి ఒక పాడి ఆవు అక్కడికక్కడే మృతి చెందిందని కృష్ణయ్య బోరున విలపించాడు. ఆవు సుమారు రూ.70 వేలు విలువ చేస్తుందన్నారు. ప్రభుత్వం ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని కోరాడు. సంఘటన స్థలాన్ని మండల పశు వైద్యాధికారి శ్రీధర్ పరిశీలించి, ఆర్థికసాయం మంజూరు కోసం ప్రభుత్వానికి నివేదిక పంపుతామని తెలిపారు.

బైరెడ్డిపల్లెలో...

బైరెడ్డిపల్లె : మండల పరిధిలో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కామినేపల్లికి చెందిన సుబ్రమణ్యం పాడి ఆవు మృతి చెందింది. మంగళవారం ఈయన తన పొలంలో ఆవును కట్టేసి ఉంచగా ఉరుములు, మెరుపులతో పాటు పిడుగుపడింది. తోటకు వెళ్లి సుబ్రమణ్యం చూడగా ఆవు విగతజీవిగా పడి ఉంది. రూ.92 వేలు విలువ చేసే పాడి ఆవు మృతి చెందడంతో తీరని నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు.

టూరిస్ట్ బస్సుకు భారీ జరిమానా



పట్టుబడిన బస్సుకు ట్యాక్స్ వేస్తున్న ఎంవీఐ

చిత్తూరు రూరల్: నకిలీ ట్యాక్స్‌తో తిరుగుతున్న ఓ బస్సును రవాణాశాఖ అధికారులు మంగళవారం పట్టుకున్నారు. మధ్యప్రదేశ్ నుంచి టూరిస్ట్ ట్రావెల్ బస్సు చిత్తూరు మీదుగా వెళ్తోంది. వెళ్లే దారి తప్పి తికమకపడి సదరు డ్రైవర్ బస్సును కలెక్టరేట్ సమీపంలో తిప్పుతూ కనిపించాడు. ఆ సమయంలో తనిఖీలు చేస్తున్న ఎంవీఐ రాజేశ్వర్ రావు బస్సును ఆపి రికార్డులను పరిశీలించారు. అయితే ట్యాక్స్ లేదని గుర్తించారు. ట్యాక్స్ లేదని ప్రశ్నిస్తే నకిలీ ట్యాక్స్ చూపించడంతో బస్సును అదుపులోకి తీసుకున్నారు. రూ.1.10 లక్షలు జరిమానా విధించారు.

బహుదా ఉగ్రరూపం

- నదీ ప్రవాహానికి గాజులపల్లె-తొడతర మధ్య కొట్టుకుపోయిన కల్వర్టు
- అధికారుల నిర్లక్ష్యం.. జనానికి తప్పని ఇక్కట్లు
- కల్వర్టును పరిశీలించిన ఎమ్మెల్యే, అధికారులు
- యుద్ధప్రాతిపదికన మరమ్మతులు



గాజులపల్లె-తొడతర గ్రామాల మధ్యలో బహుదానది వరద ప్రవాహానికి కొట్టుకుపోయిన కల్వర్టు

తవణంపల్లె: మండలంలోని అరగొండ బహుదానది తుపాను ప్రభావంతో ఉరుములు, మెరుపులతో సోమవారం అర్ధరాత్రి తరువాత కురిసిన భారీ వర్షానికి ఉగ్రరూపం దాల్చింది. మరోవైపు నాలుగేళ్ల తర్వాత బహుదానది ఉధృతంగా ప్రవహించడంతో మండలంలోని ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గంగాదేవికి మహిళలు మంగళ హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

కొట్టుకుపోయిన రోడ్డు కల్వర్టు..

మండలంలోని మాధవరం, సరకల్లుకు పడమటి ప్రాంతాల్లోని అటవీప్రాంతాల్లో భారీ వర్షాలు కురవడంతో చెరువులు నిండి మొరవలు రావడంతో అరగొండ బహుదానది ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో గాజులపల్లె-తొడతర మధ్యలో రోడ్డు కల్వర్టు, అరగొండ, మత్యం గ్రామాల దగ్గర ఉన్న కల్వర్టులు కొట్టుకుపోయి వాహనాలు, ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగింది.

ముందు చూపులేని అధికారులు..

వర్షాకాలంలో పడమటి ప్రాంతాల్లోని అడవుల్లో భారీ వర్షాలు కురిస్తే బహుదానది ఉగ్రరూపం దాల్చి ప్రవహిస్తుందని ప్రజాప్రతినిధులకు, అధికారులకు తెలుసు. కానీ అధికార యంత్రాంగానికి ముందు చూపులేక చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టినట్లు ఇబ్బంది కలుగుతుందని తెలిసినా ముందస్తు చర్యలు చేపట్టకపోవడం శోచనీయం. బహుదానది ప్రవహించినప్పుడల్లా అధికారులు తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టడం తప్ప శాశ్వతమైన పనులు చేపట్టడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు సైతం విఫలమవుతున్నారు. తాత్కాలిక పనులు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారు. ప్రమాదకరమైన రోడ్డు కల్వర్టుల స్థానంలో వంతెనలు నిర్మించి శాశ్వతంగా సమస్య పరిష్కరించడానికి పాలకులు చొరవ చూపాల్సి ఉంది.

పరిశీలించిన అధికారులు

మండలంలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి తొడతర దగ్గర కల్వర్టు కొట్టుకుపోయి రాకపోకలకు అంతరాయం కలగడంతో పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు, ఇరిగేషన్ ఈఈ శ్రీనివాసులు, డీఈ రాధిక, జేఈ ఆదికేశవులు, పీఆర్ ఈఈ చంద్రశేఖర్ రెడ్డి, మండల జేఈ జయచంద్రారెడ్డి, తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీఓ రెడ్డి బాబు, స్థానిక నాయకులు పరిశీలించారు. యుద్ధప్రాతిదకన పనులు చేపట్టాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించడంతో పనులు చేపట్టి తాత్కాలికంగా రాకపోకలకు అవకాశం కల్పించారు. వర్షం పడడంతో పనులు ముందుకు సాగలేదు. అదేవిధంగా అరగొండ దగ్గర కల్వర్టు దెబ్బతినడంతో సర్పంచ్ మల్లుదొరై, ప్రశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో కాలువను శుభ్రం చేయించారు. అటుగా ఎవరూ వెళ్లకుండా కంపలు వేశారు.



కల్వర్టును పరిశీలిస్తున్న పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, అధికారులు



ఉధృతంగా ప్రవహిస్తున్న బహుదానది

రోగాలు ప్రబలకుండా చర్యలు చేపట్టండి



తూగుండ్రం పీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతి దేవి

గంగాధర నెల్లూరు: రానున్న మూడు రోజులు వర్షం పడే అవకాశం ఉన్నందున సిబ్బందికి సెలవులు ఇచ్చే పరిస్థితి లేదని, గ్రామాల్లో ప్రజలకు అంటువ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్త తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ప్రభావతి దేవి తెలిపారు. మంగళవారం ఆమె మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో మాతాశిశు సంరక్షణ, మందుల నిల్వ, ల్యాబ్ టెస్టింగ్, డెలివరీలు, కార్యాలయ నిర్వహణ రికార్డులను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. సీజనల్ వ్యాధులైన డయేరియా, దోమ కాటు ద్వారా వచ్చే మలేరియా, డెంగు జ్వరాలపై వైద్యాధికారులు రోజువారి మానిటరింగ్ చేయాలన్నారు. ప్రైవేట్ హాస్పిటళ్లు, నర్సింగ్ హోమ్స్, ఆర్ఎంపీలు జ్వరం కేసుల డేటాను ఫాలోఅప్ చేయాలని తెలిపారు. స్కూళ్లు, హాస్టళ్లలో వైద్యాధికారులు, సీహెచ్‌ఓలు రోజువారి కార్యాచరణతో వాటర్ టెస్టింగ్, మెడికల్ క్యాంపులతో పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మాతాశిశు సంరక్షణపై పూర్తి వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం, మిషన్ ఇంద్రధనస్సు ఇంటింటి హెడ్ కౌంట్ సర్వే, బ్రెస్ట్ ఫీడింగ్, పౌష్టికాహారం, రక్తహీనతపై తల్లులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్లు దివ్య, మౌనిక, సిబ్బంది పాల్గొన్నారు

మొగిలి ఘాట్‌లో లారీ బోల్తా



మొగిలి ఘాట్ వద్ద బోల్తాపడిన లారీ

బంగారుపాళెం: మండలంలోని మొగిలి ఘాట్ దొరచెరువు వద్ద చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిపై సోమవారం రాత్రి ముందు వెళ్తున్న వాహనాన్ని ఢీకొని బోల్తాపడింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పలమనేరు నుంచి చిత్తూరుకు వెళ్తున్న ఐచర్ వాహనాన్ని వెనుక నుంచి వస్తున్న ఓ లారీ ఢీకొనడంతో అదుపు తప్పి రహదారి పక్కకు బోల్తా పడింది. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు. వాహనాలు దెబ్బతిన్నాయి. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వాహనాలను పక్కకు తొలగించి వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు.

మీడియా అవార్డులకు దరఖాస్తు చేసుకోండి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఓటర్లను చైతన్య పరిచే క్రమంలో ఉత్తమ ప్రచారం నిర్వహించిన మీడియాకు ఉత్తమ అవార్డు ఇవ్వనున్నారని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఓటు హక్కు వినియోగ ఆవశ్యకతపై ఓటర్ల చైతన్యం, అవగాహన ప్రచారంలో ఉత్తమంగా కృషి చేసిన మీడియా సంస్థలకు భారత ఎన్నికల సంఘం మీడియా అవార్డులను అందిస్తుందన్నారు. ఈ అవార్డులకు అర్హత, ఆసక్తి ఉన్న మీడియా సంస్థలు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్(టెలివిజన్), ఎలక్ట్రానిక్ (రేడియో), ఆన్‌లైన్ (ఇంటర్నెట్, సోషల్) మీడియా రంగాల్లో ఓటర్లలో చైతన్యం, అవగాహన పెంపొందించేందుకు ఉత్తమ కృషి చేసిన వారు అర్హులన్నారు. వచ్చే ఏడాది జనవరి 25వ తేదీన జాతీయ ఓటర్ల దినోత్సవం రోజున ఈ అవార్డులను అందిస్తారని తెలిపారు. ఎంపికయ్యే వారికి ప్రశంసాపత్రంతో పాటు, జ్ఞాపికను అందిస్తారన్నారు. దరఖాస్తులను డిసెంబర్ 10వ తేదీ లోపు రాజేశ్ కుమార్ సింగ్, అండర్ సెక్రటరీ(కమ్యునికేషన్), ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా, నిర్వాచన్ సదన్, అశోకా రోడ్డు, న్యూఢిల్లీ-110001 అడ్రస్‌కు పోస్టులో లేదా mediadivision@eci.gov.inకు మెయిల్‌లో పంపవచ్చన్నారు. వివరాలకు 011-23052131 నంబర్‌లో సంప్రదించాలని కలెక్టర్ కోరారు.

లాటరీ టికెట్ల విక్రేత అరెస్ట్

పుంగనూరు: పట్టణంలో చట్టవిరుద్ధంగా లాటరీ టికెట్లు విక్రయిస్తున్న వ్యాపారి ఎస్.ముభారక్‌ను అరెస్ట్ చేసినట్లు సీఐ శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా లటరీ టికెట్లను పట్టణంలోని సెంటర్‌లాడ్జిలో తోపుడుబండ్లపై పెట్టుకుని రహస్యంగా విక్రయిస్తుండగా సమాచారం మేరకు పట్టుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు నిందితున్ని అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి లాటరీ టికెట్లు, రూ.8 వేలు స్వాధీనం చేసుకుని, అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

ఎంపీటీసీ సభ్యుడు జగన్నాథరాజు కిడ్నాప్ ?

- అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడని బంధువుల ఆరోపణ
- నూజివీడు ప్రభుత్వాస్పత్రిలో మృతదేహం ఉందంటున్న వైనం
- జేసీబీ కంతులు కట్టకపోవడంతో ఫైనాన్స్ కంపెనీ వాళ్లు కిడ్నాప్ చేసినట్లు ఫిర్యాదు
- విచారణ చేస్తున్న జీడీ నెల్లూరు పోలీసులు

గంగాధరనెల్లూరు: పాలసముద్రం మండలానికి చెందిన టీడీపీ నాయకుడు, ఎంపీటీసీ సభ్యుడు సోమవారం అర్ధరాత్రి కిడ్నాప్ అయ్యాడని మంగళవారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు అందింది. అయితే ఆయన మృతి చెందాడని, మృతదేహం నూజివీడు ప్రభుత్వ ఆస్పత్రిలో ఉందని ఆయన బంధువులు ఆరోపిస్తున్నారు. గంగాధరనెల్లూరు సీఐ లక్ష్మీనారాయణ కథనం మేరకు.. పాలసముద్రం మండలానికి చెందిన టీడీపీ నాయకుడు జగన్నాథరాజు నరసింహరాజుపురం పంచాయతీ టీపీఎన్ఆర్ పురం ఎంపీటీసీ సభ్యుడు. సోమవారం రాత్రి అంభోదరపల్లె సమీపంలో కొంతమంది కాపుగాసి అతన్ని వాహనంలో కిడ్నాప్ చేసి తీసుకెళ్లారని ఆయన వద్ద జేసీబీ డ్రైవర్‌గా పనిచేస్తున్న శంకర్ మంగళవారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ ఫిర్యాదులో జగన్నాథరాజు ఇటీవల నూజివీడుకు చెందిన ఫైనాన్స్ సంస్థ వద్ద జేసీబీ తీసుకున్నారని, అయితే కంతులు సరిగా కట్టడం లేదని మాట్లాడ్డానికి ఐదుగురు వ్యక్తులు సోమవారం జీడీనెల్లూరుకు వచ్చారని తెలిపాడు. అనంతరం జగన్నాథరాజు ఆచూకీ తెలుసుకుని అంభోదరపల్లె సమీపంలో కాపుగాసి వారు వెంట తెచ్చుకున్న వాహనంలో కిడ్నాప్ చేసి విజయవాడకు తీసుకెళ్లినట్లు తెలియజేశాడు. తమకు అందిన ఫిర్యాదు మేరకు వీరేష్, శివ, నాగరాజు, మణి, చంద్ర అనే వ్యక్తులపై కేసు నమోదు చేస్తామని సీఐ తెలిపారు. ఇదిలా ఉంటే జగన్నాథరాజు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడని, మృతదేహం నూజివీడు ప్రభుత్వ ఆస్పత్రిలో ఉందని, ఫైనాన్స్ లావాదేవీలే కారణమని బంధువులు ఆరోపిస్తున్నారు. అయితే ఎంపీటీసీ సభ్యుడి మృతికి గల కారణాలు పోలీసుల విచారణలో తెలిసే అవకాశం ఉంది.

పోలీసుల అదుపులో అనుమానితుడు!

చిత్తూరు కార్పొరేషన్: యాదమరి మండలంలో పులి కళేబరాన్ని గుర్తించిన ఘటనలో ఒక అనుమానితున్ని అదుపులో తీసుకుని రహస్యంగా విచారిస్తున్నట్లు తెలుస్తోంది. పులిని చేనులో చంపి అటవీప్రాంతంలో పడేసినట్లు అనుమానం వ్యక్తం అవుతోంది. విచారణలో భాగంగా చేను యజమానిని అనుమానితుడిగా భావించి అదుపులో తీసుకున్నారు. పలు కోణాల్లో ప్రశ్నలు వేస్తూ అధికారులు కూపీ లాగుతున్నారు. ఉచ్చు ఎలా బిగించారు ? పులి సమాచారం ఎలా తెలుసు ? ఉచ్చులో చిక్కిన తర్వాత ఎలా చంపారు ? విద్యుత్‌షాక్ ఏమైనా ఇచ్చారా ? అనే కోణంలో ఆరా తీశారు ? పులి గోర్లు, దంతాలు ఎవరికి విక్రయించారు ? ఎంతమంది పాల్గొన్నారు ? అనే అంశాల పరంగా దర్యాప్తు జరుగుతోంది. వీటిపై బుధవారం క్షేత్రస్థాయిలో బృందాలుగా ఏర్పడి సంఘటన ప్రాంతం చుట్టుపక్కల గ్రామాల్లో అధికారులు, సిబ్బంది పర్యటించనున్నారు. మొబైల్ సిగ్నల్ ఆధారంగా విచారణ ముమ్మరం చేశారు.

కాణిపాకం ఆలయానికి భారీ ఆదాయం

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలోని ఆస్థాన మండపంలో మంగళవారం క్యాలెండర్లు, డైరీలు విక్రయ లైసెన్స్, లగేజీలు భద్రపరుచు లైసెన్స్‌లు, క్యాంటీన్ నిర్వహణకు బహిరంగ వేలం నిర్వహించారు. 2025 సంవత్సర క్యాలెండర్, డైరీల ముద్రణ, విక్రయ లైసెన్స్‌కు రూ.32,10,000, లగేజీ భద్రపరుచు లైసెన్స్‌కు రూ.32,76,000, షాపు నంబరు 28,29లో క్యాంటీన్ నిర్వహణకు రూ.29,17,116 కలిపి..మొత్తం ఆలయానికి రూ.94,03,116 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ గురుప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ కృష్ణారెడ్డి, హరి మాధవరెడ్డి, బాలరంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి..



భరత్‌రాజ్ (ఫైల్)

పూతలపట్టు: అతివేగంతో వెళ్తున్న ఓ యువకుడు బైక్ అదుపు తప్పి ప్రాణాలు కోల్పోయిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. సీఐ కృష్ణమోహన్ కథనం మేరకు.. తవణంపల్లి మండలం వెంగంపల్లికి చెందిన సుబ్రమణ్యం కుమారుడు సి.భరత్‌రాజ్(26) మంగళవారం పూతలపట్టు మండలం యం.బండపల్లిలోని ఆంజనేయస్వామి ఆలయంలో పనులు ముగించుకుని ఇంటికి వెళ్తున్నాడు. అయితే కాణిపాకం క్రాస్ వద్ద బైక్‌పై అతివేగంతో వస్తుండగా ఒక్కసారిగా అదుపుతప్పడంతో కింద పడిపోయాడు. ప్రమాదంలో తలకు తీవ్రగాయాలవడంతో భరత్‌రాజ్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

తల్లిని అసభ్యంగా మాట్లాడాడని..

శ్రీసిటీ(వరదయ్యపాళెం): తన తల్లిని అసభ్యంగా మాట్లాడాడనే కోపంతో ఓ వ్యక్తిపై నిందితుడు దాడిచేసి హత్య చేసినట్లు శ్రీసిటీ డీఎస్పీ పైడేశ్వరరావు తెలిపారు. మంగళవారం శ్రీసిటీ డీఎస్పీ వివరాలను వెల్లడించారు. శ్రీసిటీ పారిశ్రామికవాడలో ఓ పరిశ్రమలో పని చేస్తున్న జార్ఖండ్‌కు చెందిన సికారి ముర్ముపై సమీప బంధువు విక్రమ్‌ముర్ము ఇటీవల దాడిచేసి హత్య చేశాడు. తన తల్లిని అసభ్యంగా మాట్లాడనే కోపంతో దాడిచేసి హత్య చేసినట్టు డీఎస్పీ తెలిపారు.

ఆవుల చోరీ ముఠా అరెస్ట్



నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

కార్వేటినగరం: అటవీ ప్రాంతంలో మేతకు వెళ్లే ఆవులను అపహరించి పశువధ చేసి విక్రయించే ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ రాజ్‌కుమార్ కథనం మేరకు.. వెదురుకుప్పం మండలం దిగువ గెరిగదొన గ్రామానికి చెందిన బి.హరిబాబు ఇటీవల పశువులను సమీప అడవిలో మేతకు తీసుకెళ్లాడు. అయితే వడమాలపేట మండలం ఎస్‌బీఆర్‌పురం ఎస్సీ కాలనీకి చెందిన సూర్య, పట్లూరి తరుణ్, ఎగువ గూలూరు గ్రామానికి చెందిన లవకుమార్, హేమాద్రి కలిసి ఆవును అపహరించారు. దీంతో ఆవు కనిపించకపోవడంతో బాధిత పాడిరైతు హరిబాబు వెతికాడు. అయితే నిందితులు ఆవును వధించి విడిభాగాలను ఆటోలో తీసుకెళ్లే ప్రయత్నం చేస్తుండగా స్థానికులు గమనించి పట్టుకునే యత్నం చేయగా పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఈనెల 20న పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణలో భాగంగా ఈ నెల 21న సోమవారం ఉదయం 11 గంటలకు ఆవును చోరీ చేసి వధించిన సూర్య, తరుణ్, ఎగువ గూలూరుకు చెందిన లవకుమార్, హేమాద్రిని సురేంద్ర నగరం క్రాస్ వద్ద అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ చెప్పారు. గతంలో కూడా వీరు ఒక ఆవును అపహరించి గుర్తు తెలియని వ్యక్తులకు విక్రయించినట్లు దర్యాప్తులో వెల్లడించినట్లు చెప్పారు. నిందితులను పుత్తూరు కోర్టుకు తరలించగా రిమాండ్ విధించినట్లు తెలిపారు.

లారీ ఢీకొని మహిళ దుర్మరణం



గంగవరం: రోడ్డు క్రాస్ చేస్తున్న గుర్తు తెలియని మహిళను లారీ ఢీకొట్టడంతో ఘటనా స్థలంలోనే మృతి చెందిన ఘటన మండలంలోని పలమనేరు-బెంగుళూరు జాతీయ రహదారిలోని నాలుగురోడ్లు కూడలి సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలకు.. దాదాపు 50 ఏళ్లు పైబడిన మహిళ నాలుగురోడ్లు పరిసరాల్లో కొంతకాలంగా మతిస్థిమితం లేకుండా సంచరిస్తోంది. మంగళవారం సాయంత్రం కూడలికి సమీపంలోని కాఫీబార్ వద్ద ఆమె రోడ్డు క్రాస్ చేస్తుండగా బెంగళూరు వైపు వెళ్తున్న లారీ ఢీకొని ఆపకుండా వెళ్లిపోయింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న హైవే పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మహిళ మృతదేహాన్ని పరిశీలించారు. అయితే ఆమె ఎవరనే వివరాలు లభ్యం కాలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించిన హైవే పోలీసులు ప్రమాదానికి కారణమైన లారీని పట్టుకునేందుకు కర్ణాటకకు వెళ్లారు. జరిగిన ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

4 నుంచి సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో నవంబర్ 4వ తేదీ నుంచి సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షలు జరుగుతాయని డీవైఈఓ చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు నవంబర్ 4 నుంచి 7వ తేదీ వరకు, 6వ తరగతి నుంచి 8వ తరగతి వరకు నవంబర్ 4వ తేదీ నుంచి 8 వరకు, అలాగే 9, 10 తరగతులకు నవంబర్ 4వ తేదీ నుంచి 8 వరకు పరీక్షలు నిర్వహించాలని డీవైఈఓ వెల్లడించారు.

జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక

పూతలపట్టు: మండల కేంద్రంలోని జిల్లా ఉన్నత పాఠశాలలో మంగళవారం జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి వసంతవాణి ఆధ్వర్యంలో జిల్లాస్థాయి అండర్-14 హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు. హ్యాండ్‌బాల్ పోటీల్లో బాలుర జట్టులో గోవర్ధన్ నాయక్, వసంత్‌కుమార్, చైతన్య, సాయినాథ్, ఫయాజ్, యువరాజ్, కార్తికేయ, గణేష్, లోకేష్‌నాయక్, ప్రకాష్, గోవర్ధన్, జీవన్‌తేజ, గౌతమ్, సునీల్, శశాంక్ ఎంపికయ్యారు. బాలికల జట్టులో కావ్య, సవీయ, కీర్తన, నిహారిత, అర్చన, పావనిప్రియ, జయనల్‌ఖాన్, మోషిత, శ్రీలేఖ, పూజ, దీక్షిత, మౌనిక, అమృత, జయప్రియ, నిహిత ఎంపికయ్యారు. జిల్లాస్థాయికి ఎంపికైన విద్యార్థులు ఈనెల 26 నుంచి 28 వరకు గుంటూరు జిల్లా తెనాలిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో పీడీలు రవీంద్రరెడ్డి, కృష్ణయ్య, డిల్లీరాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు